# ఔన్నత్యానికి అంతస్తులెందుకు?



**- జి.ఎస్ భూషణరావు**

"ఈ ఆదివారం నీకేమైనా అర్జంటు పనులున్నాయా?" నా బ్రీఫ్‌కేస్‌ను టేబుల్‌మీద పెడుతూ అడిగింది అమ్మ.

"ఎందుకమ్మా? ఎక్కడికైనా వెళ్ళాలా?" టై కట్టుకుంటూనే అడిగాను.

"వెళ్ళటం కాదురా. మన రమేష్‌కి కొత్తగా పెళ్ళయ్యిందికదా! వాళ్ళని ఈ ఆదివారం భోజనానికి పిలిచాను. నువ్వు కూడా వుంటే బావుంటుంది కదా?"

"అలాగే అంత అర్జంటు పనులేంలేవు. ఒకవేళ వున్నా కాన్సిల్ చేసుకుంటాలే" అన్నాను అద్దంలో చూసుకుంటూ.

"నీకేం ఇబ్బంది లేదుకదా" అంది అమ్మ సంకోచిస్తూనే.

"భలేదానివే నాకు ఇబ్బందేమిటి?" అన్నాను చిరునవ్వుతో.

"వాడు నీకింద పనిచేసేవాడు కదా వాడిని భోజనానికి పిలిస్తే ..." మాటల్ని మధ్యలోనే ఆపేసింది.

చివ్వున ఆమెవైపుకి తిరిగాను. "ఏమ్మా. నా ప్రవర్తన ఎప్పుడైనా నీకలా అనిపించిందా?" అన్నాను బాధపడుతూ.

"లేదులేరా. ఊరికే అన్నాను. అయినా నువ్వు నా కొడుకువేకదా" అంది అమ్మ నవ్వుతూ.

నేను కూడా నవ్వి "మరి నే వస్తానమ్మా" అని కోటు భుజమ్మీదేసుకుని బయటకు నడిచాను.

నేను రావటం చూసి చప్పున కారు డోరు తెరిచాడు రమేష్. నేను కూర్చోగానే డోరు మూసి లోపలికెళ్ళి బ్రీఫ్‌కేసు తీసుకొచ్చి కార్లో పెట్టి కారు స్టార్టు చేశాడు.

రమేష్ నా కారు డ్రైవరు. ఓ ప్రముఖ టెక్స్‌టైల్ ఇండస్ట్రీకి అసిస్టెంట్ మేనేజర్‌ని నేను. ఫర్నిష్డ్ అపార్ట్‌మెంట్‌తో పాటు కారు సౌకర్యం కూడా కల్పించింది కంపెనీ నాకు. రమేష్ జీతం కంపెనీనే భరిస్తున్నా వాడు నా సొంత కారు డ్రైవరులాగానే మసలుకొంటాడు. వాడిది కరీంనగర్ జిల్లాలోని ఓ పల్లెటూరు. ఇంటర్‌వరకూ చదివాడు. ఎప్పుడు మద్రాసుకు వచ్చాడో తెలీదు గానీ నేను కంపెనీలో చేరినప్పట్నుంచీ నా కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు.

స్వల్పకాలంలోనే మా ఇంట్లో మనిషయిపోయాడు. అమ్మ దగ్గర మరీ చనువెక్కువ వాడికి. అమ్మ వంట చేస్తుంటే కూరగాయలు తరుగుతూ కబుర్లు చెబుతాడు. వడియాలు పెట్టడంలో కూడా వాడి సాయం వుండవలసిందే. అమ్మతో కలిసి షాపింగుకెళ్ళటం దగ్గరనుంచి పాత తెలుగు సినిమా కాసెట్లు తెచ్చి అమ్మతో కలిసి చూసేంత చనువుంది అమ్మ దగ్గర వాడికి. వాడు ఒక్కరోజు రాకపోయినా అమ్మకు ఏంతోచేదికాదు. "ఒరే అబ్బాయ్" అంటూ ప్రతి విషయం వాడితో చర్చించడం అమ్మకు అలవాటైపోయింది. అప్పుడప్పుడు వాడి తెలంగాణా యాసను అనుకరిస్తూ వాడిని ఆటపట్టించేది.

ఇంత చనువున్నా వాడు హద్దుల్ని మీరకపోవటం గమనించాను నేను. నేను ఇంట్లో వుంటే వాడు కూర్చోడు. అమ్మతో కూర్చుని కబుర్లు చెబుతున్నవాడల్లా నేను రాగానే చప్పున లేచి నిల్చునేవాడు. "కూర్చోరా అబ్బాయ్ వాడు నీకు బయట ఆఫీసరు కానీ ఇంట్లో కాదు" అని అమ్మ అంటుంటే నవ్వేవాడే కానీ కూర్చునేవాడు కాదు. నెల రోజుల క్రితమే పెళ్ళయ్యింది వాడికి. వాడి మేనమామ కూతురేనట. అయిదోక్లాసు వరకూ

**కమల్ సంకల్పం...**



కమల్‌హాసన్ 1996లో ఓ పంచ లన చిత్రాన్ని సొంత బ్యానర్‌పై నిర్మించే ఆలోచనలో వున్నాడు. స్వాతంత్ర్యసమరయోధుల త్యాగ జీవితం కథాంశంగా ఓ సొంత చిత్రాన్ని రూపొందించాలని కమల్ ఎప్పటినుండో యోచిస్తున్నా అది ఈ ఏడాది ఆచరణసాధ్యం కాగల దని తెలుస్తోంది. తెలుగులో తన తొలి చిత్ర నిర్మాణంతోనే కోలుకో లేని నష్టాలపాలయిన కమల్ ఈ దఫా బ్రిటీష్ వ్యవస్థపై తన సొంత చిత్రాన్ని తమిళంలో రూపొందిం చాలనుకుంటున్నాడు! ద్రోహికాల్ బాక్సాఫీస్ హిట్టవ్వగా అదే చిత్రం (ద్రోహి) తెలుగువారి ఆదరణ పొందలేకపోవటం గమనార్హం!

— 'సత్యశ్రీ'

చదువుకుందని చెప్పాడు. వాడి పెళ్ళికి వెళ్ళాలని వున్నా మద్రాసు నుంచి కరీంనగర్‌కు వెళ్ళటం మాటలు కాదు. అందులోనూ నేను ఆ జిల్లాకు ఎప్పుడూ వెళ్ళలేదు. అందుకే వెళ్ళాలని వున్నా వెళ్ళలేకపోయాను. వాడు వెళుతుంటే భార్యాభ ర్తలకి బట్టలతో పాటు వాడి చేతిలో వెయ్యి రూపాయిలు పెట్టింది అమ్మ. అమ్మ ఎప్పుడూ వాడ్ని పనివాడుగా చూడలేదు. నాతో మాట్లా డినట్టే వాడితోనూ మాట్లాడుతుంది. అప్పుడ ప్పుడూ అమ్మను చూసి గర్వపడుతుంటాను నేను. అమె మంచితనమే నన్నీస్థితికి తీసుకొచ్చిందని నా నమ్మకం. స్కూలు టీచరుగా పనిచేస్తున్న నాన్న నా పన్నెండో ఏటనే చనిపోతే వచ్చే పెన్షన్‌తో పాటు తాను పనిచేస్తూ సంపాదించిన డబ్బుతో నన్ను కష్టపడి చదివించి ఈ స్థితికి తీసుకొచ్చింది. ఇరవై ఏడేళ్ళ వయసులో పేరున్న కంపెనీకి అసి స్టెంట్ మేనేజర్‌ని కావటం మాటలు కాదు. దీని వెనక అమ్మ మంచితనం వుంది.

ఆ ఆదివారం భార్యను తీసుకుని మా ఇంటి కొచ్చాడు రమేష్. ఆ అమ్మాయి నల్లగా వున్నా శుభ్రంగా రమేష్‌కి తగ్గట్టుగా వుంది. బిడియ పడుతూ, భయపడుతూ గుమ్మందగ్గరే నిలబడ్డ ఆమెను అమ్మ చేయిపట్టుకుని లోపలికి తీసుకొ చ్చింది.

"నా భార్య గౌరమ్మ సార్" అంటూ పరిచయం చేశాడు రమేష్.

"నమస్తే సారూ! నమస్తే అమ్మగారూ" అంటూ రెండు చేతులతోనూ దండం పెట్టింది గౌరమ్మ.

"అమ్మగారూ ఏమిటే అమ్మాయ్. అమ్మా అని పిలు. రమేష్ బయటివాడేకాదు. మా ఇంట్లో మనిషే" అంది అమ్మ నవ్వుతూ.

"ఇక్కడికి రావటానికి భయపడింది అమ్మా. మా అమ్మ, సారు చాలా మంచివాళ్ళని చెప్పి బలవంతంగా తీసుకొచ్చాను" అన్నాడు రమేష్ నవ్వుతూ.

"భయమెందుకే ఆమ్మాయ్. నీకు తెలీదుగానీ మా అబ్బాయితో కంటే వీడితోనే ఎక్కువగా మాట్లాడతాను నేను. అన్నట్టు ఒసే అంటున్నా నని ఏమీ అనుకోకు. నాకు రమేష్ కొడుకుతో సమానం. వాడి పెళ్ళాన్ని ఒసే అనే ఆపాటి హక్కు నాకు వుంటుంది కదా" అంది అమ్మ నవ్వుతూనే.

"అయ్యో గట్లంటరేందమ్మా. మిమ్మల్ని చూస్తుంటే మా అమ్మే యాదికొస్తంది. మీరు ఒసే అని పిలుస్తాంటే మా అమ్మ పిలుస్తున్నట్టే వుంది" అంది గౌరమ్మ గద్గదికంగా.

గౌరమ్మని పక్కనే కూర్చోపెట్టుకుని అమ్మ కబు ర్లలో మునిగిపోయింది. నేను "కూర్చో" అని రెండు మూడుసార్లు చెప్పిన తర్వాత రమేష్ సోఫాలో ఓ మూలకు ఒదిగి కూర్చున్నాడు.

బయట కారు ఆగిన చప్పుడు వినిపించింది. ఈ వేళప్పుడు ఎవరొస్తారబ్బా? అని నేను ఆలోచించేంతలోనే ఫారిన్ సెంట్ పరిమళం ముక్కుపుటాలను తాకింది.

వచ్చింది రమాకాంత్ అయ్యుంటాడని నేను అనుకునేంతలో లోపలికొచ్చేశాడు రమాకాంత్. వెంట మిసెస్ రమాకాంత్ కూడా వుంది. ఖరీ దైన సూట్‌లో వెలిగిపోతున్నాడు రమాకాంత్. ఓవర్‌మేకప్‌తో మెరిసిపోతోంది మిసెస్ రమా కాంత్.

"ఇంట్లో వుంటావో లేదో అనుకున్నాను. మొత్తా నికి దొరికా వు... " అని ఇంకా ఏదో అనబోతూ రమేష్‌వాళ్ళను చూసి మాటలు మధ్యలోనే ఆపే శాడు.

మిసెస్ రమాకాంత్ మొహం చిట్లించుకుంది.

రమేష్ మాతో పాటు కూర్చోవటం ప్రపంచంలో ఎనిమిదో వింతైనట్లు చూశాడు రమాకాంత్.

రమాకాంత్‌ను చూడగానే చప్పున లేచి నిల్చుని నమస్కారం పెట్టాడు రమేష్. కనీసం వాడివే పైనా చూడలేదు రమాకాంత్.

షాకయిపోయిన వాళ్ళిద్దర్నీ బయటపడేస్తూ "కూర్చోండి" అన్నాను.

రమాకాంత్ కూర్చున్నాడు. మిసెస్ రమాకాంత్ మాత్రం దూరంగా వున్న సోఫాలో కూర్చుంది. గౌరిపక్కనే కూర్చోవటం నామోషీ అని ఆమెను చూస్తే స్పష్టమవుతోంది.

"ఇద్దరూ కలిసి వచ్చారంటే ఏదో విశేషమే" అన్నాను నవ్వుతూ.

"విశేషమే. మన కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో విశ్వనాథన్‌ది బిగ్‌హాండని నీకు తెలుసుకదా. ఆయనను మా ఇంటికి పార్టీకి ఆహ్వానించాను. నువ్వుకూడా వస్తే బాగుంటుంది. ముందు ముందు అతను మనకు బాగా ఉపయోగపడ తాడు" అన్నాడు రమాకాంత్ ఉత్సాహంగా.

"సారీ రమాకాంత్. నేను రాలేను. ఇవాళ రమేష్‌వాళ్ళని భోజనానికి పిలిచాను. అయాం వెరీసారీ" అన్నాను మొహమాటంగానే.

నిస్తుపోయేడు రమాకాంత్ "నీ ఇష్టం మరి వస్తాను" అన్నాడు ముభావంగా. మిసెస్ రమా కాంత్ అప్పటికే లేచి నిల్చుంది.

"అదేమిటి? అప్పుడే వెళుతున్నారు. కాఫీ తాగి వెళ్ళండి" అంది అమ్మ.

"ఫరవాలేదాంటీ. ఇంట్లో అరేంజ్‌మెంట్స్ అన్నీ చూసుకోవాలి. మరోసారి వస్తాంలెండి" అంది మిసెస్ రమాకాంత్ నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"మీరు పార్టీకి వెళితే బావుండేది సార్" అన్నాడు రమేష్ వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత.

"అదేమిటి? మిమ్మల్ని పార్టీకి పిలిచి నేను పార్టీకి వెళ్ళటం మర్యాదేనా?" అన్నాను నవ్వుతూ.

"మాదేముందిసార్. అమ్మగారున్నారుకదా. భోజనం చేసి మేం వెళ్ళిపోయేవాళ్ళం" అన్నాడు వాడు.

"ఏడ్చావులే నోరుమూసుకో" అంటూ వాన్ని సున్నితంగా మందలించాను.

పదినిమిషాల్లోనే గౌరమ్మ బెదురుపోయింది. అమ్మతో గలగలా కబుర్లు చెబుతోంది.


"చిన్నమ్మగారు తల్లిగారింటికి పోయిందా అమ్మా?" అంది ఇంట్లోకి కలియజూస్తూ.

"అత్తగారింటికి వస్తే కదా తల్లిగారింటికి వెళ్ళేది. మీ సారుకింకా పెళ్ళికాలేదే" అంది అమ్మ నవ్వుతూ.

"గట్లనా! సారుకు మంచి పిల్లను చూడాలె అమ్మా. సారు లెక్కనే తెల్లగుండాలె" అంది గౌరమ్మ.

"మీ జిల్లాలో ఎవరయినా ఉన్నారేమో చూడ రాదూ" అంది అమ్మ నవ్వుతూ.

"అయ్యో. మా జిల్లాల మనుషులు మోటుగుం




టరమ్మా. సారుకు జోడీకారు. మీ దిక్కుకెళ్ళే ఎతకాలె" అంది గౌరమ్మ.

"అంత కష్టం అవసరంలేదులేవే. వాడికి మేనమామ కూతురు వుంది. విశాఖపట్టణంలో చదువుకుంటూంది ఇదే ఆఖరి సంవత్సరం. వచ్చే ఏడాది పెళ్ళి చేసే సెయ్యటమే" అంది అమ్మ.

"గట్లనా అమ్మ. సారు పెండ్లికి పని మొత్తం నేనే చేస్త. మీరు ఒక్క పని కూడా ముట్టుకో వద్దు" అంది గౌరమ్మ ఉత్సాహంగా.

"అలాగే. మీరిద్దరు తప్ప ఇంకెవరున్నారు చేయడానికి" అంది అమ్మ నవ్వుతూ.

కల్లాకపటం లేకుండా గలగలా మాట్లాడుతున్న గౌరమ్మను చూస్తే ముచ్చటేసింది నాకు.

రమేష్ మాత్రం 'ఎక్కువగా మాట్లాడకు' అంటూ కళ్ళతోనే హెచ్చరికలు చేస్తున్నాడు.

"కబుర్లేనా. భోజనం సంగతి చూసేదేమైనా వుందా" అన్నాను నేను నవ్వుతూ.

"అన్నీ రెడీ అయ్యాయి లేవండి" అంది అమ్మ డైనింగ్ హాల్లోకి నడుస్తూ.

ఏం మొహమాటం లేకుండా శుభ్రంగా తింటోంది గౌరమ్మ. రమేష్ మాత్రం సిగ్గు పడుతూ వంచిన తల ఎత్తకుండా మెల్లిగా తింటున్నాడు.

"అదేమిట్రా అబ్బాయ్. నీ పెళ్ళాం ఇంట్లో మనిషల్లే దర్జాగా తింటుంటే నువ్వేమిటి ఆడ దానిలా సిగ్గుపడతావు. సరిగా తిను" అని కోప్పడుతూ కొసరి కొసరి వడ్డించింది అమ్మ.

వాళ్ళు వెళ్ళిపోయేటప్పుడు దేవుడి దగ్గర కుంకుం భరిణ వుంది బొట్టు పెట్టుకోమ్మని చెప్పి బీరు వాలోంచి కొత్త చీర తీసుకొచ్చి గౌరమ్మ చేతిలో పెట్టింది అమ్మ. మొహమాటపడుతూనే తీసు కొని అమ్మకాళ్ళకు దండం పెట్టింది గౌరమ్మ.

మరుసటిరోజు పనికట్టుకుని వచ్చి నన్ను కలి సేడు రమాకాంత్. "ప్రభాకర్! నాకు నీ పద్ధతేం నచ్చలేదు. ఆ రమేష్‌గాడికి అంత చనువివ్వటం ఏం బాగాలేదు. ఈ లోక్లాస్ జనాల్ని దగ్గరకు తీసుకోవద్దు. నెత్తికెక్కికూర్చుంటారు. నీకన్నా అయిదేళ్ళు సీనియర్ని నేను. ఎన్ని ధక్కామొ క్కీలు తిని ఈ పొజిషన్‌కు వచ్చానో ఎవర్ని అడిగినా చెబుతారు. ముఖ్యంగా ఈ లేబర్ క్లాస్ పీపుల్స్‌తో ఎలా బిహేవ్ చేయాలో తెలీదు నీకు. కుర్రాడివి కాబట్టి చెబుతున్నా. వేరే ఎవ్వరో అయితే నాకేం అనుకునేవాణ్ని. కానీ మనం ఒకే జిల్లావాళ్ళం. పైగా ఒకే కులంవాళ్ళం. అందుకే నువ్వంటే అభిమానం నాకు. ఇప్పటి కైనా ఆ రమేష్‌గాణ్ని కాస్త భయంలో వుంచుకో వాడితో అంత చనువుగా వుండటం చూసేవా ళ్ళకు కూడా బావుండదు. అంతెందుకు మా మిసెస్ ఏమందో తెలుసా? నువ్వు బాధప డొద్దు 'ఈ ప్రభాకర్ కూడా లోక్లాసు నుంచి వచ్చినవాడే కాబట్టి ఇంకా ఆ బుద్ధులు పోవ ట్లేదు' అంది. నిజంగా నాకు చాలా బాధేసింది" అన్నాడు నిజంగానే బాధపడుతూ.

"ఆమె అన్నదాంట్లో తప్పేముంది? నేను నిజం గానే లో క్లాసు నుంచే వచ్చానుకదా?" అన్నాను చిరునవ్వుతో.

"మన పొజిషన్. పెరిగిన కొద్దీ పాత విషయా లను మర్చిపోవాలయ్యా. గతం తల్చుకుంటూ కూర్చుంటే ఈ అరిస్టోక్రాట్ సొసైటీలో పైకి వెళ్ళలేం" అన్నాడు గీతోపదేశం చేస్తున్నవాడిలా.

నేను చిరునవ్వు నవ్వి "మంచిది" అన్నాను.

"నీ ఇష్టం మరి. చెప్పాగా నువ్వంటే అభి మానం కాబట్టి ఇంత చొరవ తీసుకున్నాను. మీ అమ్మగారు అసలే భోళామనిషి. పైగా ఇంట్లో ఎప్పుడూ ఒక్కర్తే వుంటుంది. ఈ రమేష్‌గాడి విషయంలో మాత్రం కాస్త జాగ్రత్తగా వుండండి" అని చెప్పి వెళ్ళిపోయేడు.

ఆ విషయాన్ని నేను అంతటితో మర్చిపోయాను. కాని రమాకాంత్ మాత్రం కలిసినప్పుడల్లా నన్ను హెచ్చరిస్తూనే వున్నాడు.

ఆ రోజు ఏదో పని మీద నా దగ్గరికొచ్చేడు రమాకాంత్. ఇద్దరం మాట్లాడుకుంటుంటే హఠాత్తుగా తలుపు తీసుకుని లోపలికొచ్చేడు రమేష్.

"ఏరా లోపలికొచ్చేప్పుడు అడిగి రావాలని తెలీదా? అయ్యగారు చనువిచ్చారు కదా అని మంచీ మర్యాదా మర్చిపోకు" అన్నాడు రమా కాంత్ రౌద్రంగా.

"తప్పయిపోయింది సార్" అన్నాడు రమేష్ తలవంచుకుని.

ఏదైనా పనుంటే తప్ప వాడు నా గదిలోకి రాడు. ఏమిటి విషయం? అన్నట్టు వాడి వేపు చూసాను.

"ఏం లేదు సార్. మా గౌరమ్మ గుడికెళ్దా మంది. అందుకే కొంచెం తొందరగా ఇంటికె ళ్ళాలి. మిమ్మల్ని అడిగి పోదామని వచ్చాను" అన్నాడు వాడు తలదించుకునే.

"ఓహో పెళ్ళాంతో షికారు కెళ్ళాలన్నమాట. అట్లాంటివాడివి ఉద్యోగం ఎందుకు చేస్తున్నా వురా? ఉద్యోగం వదిలేసి దాన్ని వెంటేసుకుని తిరుగు. అడిగేవాడెవడూ వుండడు" అన్నాడు రమాకాంత్ కటువుగా.

నా మనస్సు చివుక్కుమంది. కానీ నాదీ నిస్స హాయ పరిస్థితే. రమేష్ ముందే ఆయన్ని నేను ఖండించలేను కదా! అందుకే "సర్లే. నువ్వెళ్ళు. కారు నేను తీసుకెళ్తాలే" అన్నాను. వాడు వెళ్ళి పోయాడు.

"చూశావా! వాడికి నువ్విచ్చిన చనువె. లేక పోతే వాడికంత ధైర్యం ఎక్కడ్నుంచి వస్తుంది" అన్నాడు రమాకాంత్ చిరాకుగా.

"పోన్లెండి పాపం. ఏదైనా పనుంటే తప్ప అలా వెళ్ళడు వాడు" అన్నాను ఆయన్ను శాంతప రుస్తూ.

"ఏమిటో. ఎన్ని చెప్పినా అర్థం కాదు నీకు" అని సణుక్కుంటూ వెళ్ళిపోయాడు రమాకాంత్.

మరుసటిరోజు తొమ్మిదయినా రమేష్ రాలేదు.

"రమేష్ ఇంకా రాలేదేమిట్రా?" ప్లేట్లో ఉప్మా పెడుతూ అంది అమ్మ.

"ఏమోనమ్మా. రోజూ ఎనిమిదికల్లా వచ్చేవాడు. ఇప్పుడు తొమ్మిదవ్వొస్తోంది. ఇంకా రాలేదు" అన్నాను టిఫెన్ తింటూ.

పదయినా రాలేదు వాడు. మరో అరగంట చూసి ఆఫీసుకు బయల్దేరదామని లేచానో లేదో రమాకాంత్ దంపతులు హడావిడిగా వచ్చారు.

రమాకాంత్ నైట్‌డ్రెస్‌లోనే వున్నాడు. మిసెస్

రమాకాంత్ మేకప్ లేకపోవడం వల్ల పదేళ్ళు వయసు పెరిగినట్టు కనిపిస్తోంది. రాత్రంతా నిద్ర లేనట్టు వాళ్ళ మొహాలు వాడిపోయి వున్నాయి.

"ఏమిటి?" అన్నాను కంగారుగా.

"పాప కనిపించడం లేదు ప్రభాకర్" అన్నాడు రమాకాంత్. అతని గొంతు జీరగా వుంది.

"పాప కనిపించడం లేదా? అసలేం జరిగింది?" అన్నాను అయోమయంగా.

"పాప నిన్న స్కూలు నుంచి ఇంటికిరాలేదు. అప్పుడప్పుడు ఏ ఫ్రెండింటికో వెళ్ళి లేట్‌గా వస్తుంది. అలాగే అని చెప్పి అనుకున్నాము. ఎనిమిదయినా రాలేదు. ఇక వుండబట్టలేక నేను స్కూలుకెళ్ళాను. వాచ్‌మెన్ పాప గురించి తనకేం తెలియదన్నాడు. దగ్గర్లోనే పాప వాళ్ళ స్కూల్ టీచర్ ఇల్లుంది. అక్కడ కనుక్కోమన్నాడు. ఆమె దగ్గరకెడితే స్కూల్ వదిలిపెట్టగానే వెళ్ళిపోయింది అని చెప్పింది. పాప స్నేహితురాళ్ళ ఎడ్రస్‌లు తీసుకుని అందరిళ్ళకూ వెళ్ళాను. ఎవ్వరూ పాప గురించి చెప్పలేదు. పాప ఎక్కడికెళ్ళిందో అర్థం కావడం లేదు" దుఃఖాన్ని బలవంతంగా అణుచుకుంటూ చెప్పాడు రమాకాంత్.

"పోలీస్ రిపోర్టిచ్చారా?" అడిగాను నేను.

"అయ్యో. కంగారులో నా కసలు ఆ ఆలోచనే రాలేదు" అన్నాడు రమాకాంత్.

వెక్కి వెక్కి ఏడుస్తోన్న మిసెస్ రమాకాంత్‌కు అమ్మ ధైర్యం చెబుతోంది.

రమాకాంత్ దంపతులకు ఒక్కతే కూతురు. పబ్లిక్ స్కూల్‌లో సిక్స్త్ క్లాసు చదువుతోంది. ఆ పాప పుట్టిన కొన్నాళ్ళకే గర్భసంచికి పుండు అయిందని ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదు. ప్రాణాలన్నీ ఆ పాప మీదే పెట్టుకుని అపురూపంగా చూసుకుంటున్నారు.

"నాలుగు దిక్కులకూ పంపి వెదికిద్దామంటే ఈ రమేష్ ఉన్నట్టుండి ఇవాళే పత్తాలేడు" అంది అమ్మ యథాలాపంగా.

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం అలుముకుంది. రమాకాంత్ దంపతులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"కొంపతీసి ఆ రమేష్‌గాడు పాపను ఏమైనా చేయలేదు కదా?" అన్నాడు రమాకాంత్ ఆలోచిస్తూ.

నా నెత్తిన పిడుగు పడ్డట్టయ్యింది.

"ఏమిటండీ మీరు మాట్లాడేది?" అన్నాను చిరాకుగా.

"నేనన్నది కరక్టే ప్రభాకర్. రమేష్ గాడికి నేనంటే కోపం. ఎప్పుడూ వాణ్ణి చీదరించుకుంటాను. పైగా నిన్న నీ ముందే తిట్టాను కూడా. అది కడుపులో పెట్టుకుని పాపను ఎత్తుకెళ్ళాడేమో" అన్నాడు రమాకాంత్.

● మెల్లగా తన్ను!

సికింద్రాబాద్ నుంచీ చార్‌మినార్‌కి వెళ్ళే బస్సులో ఇద్దరు వ్యక్తులు ఇలా పోట్లాడుకుంటున్నారు.

ఒకడు : ఒక్క తన్ను తన్నానంటే వెళ్ళి చార్‌మినార్ దగ్గర పడతావు జాగ్రత్త!

మరొకడు : ఆ తన్నేదేదో మెల్లగా తన్ను, నేను నయాపూల్ దగ్గరే దిగేదుంది.

— జి. రామలక్ష్మి

"ఛ.ఛ. వాడలాంటివాడు కాదు బాబూ ఉట్టి అమాయకుడు" అంది అమ్మ ఆ అభియోగానికి బాధపడుతూ.

"మీకు తెలీదాంటీ. అమాయకంగా కనిపించే వాళ్ళే ఎంత ఘోరానికైనా ఒడిగడతారు. అసలు వాడి చూపులే దొంగచూపులు. పైగా ఈయనంటే కోపం. వాడే పాపను ఎత్తుకెళ్ళుంటాడు" అంది మిసెస్ రమాకాంత్ వెక్కుతూనే.

"వాడి మీద పోలీస్ రిపోర్టిస్తాను" అన్నాడు రమాకాంత్ కోపంగా.

నాకంతా అయోమయంగా వుది. ఏం జరుగుతూందో అర్థం కావడం లేదు. ఇంతలో ఫోన్ మోగింది. యథాలాపంగానే రిసీవర్ ఎత్తాను. రమాకాంత్ ఇంటి నుంచి ఫోన్. వాళ్ళ పనిమనిషి చేసాడు. పాపకు యాక్సిడెంట్ అయ్యిందట. హాస్పిటల్ నుంచి ఫోన్ వచ్చిందట.

విషయం చెప్పగానే రమాకాంత్ దంపతులు గొల్లుమన్నారు. వాళ్ళను అనునయిస్తూనే హాస్పటల్‌కు బయల్దేరాం.

బెడ్ మీద కట్లలో వున్న కూతుర్ని చూస్తూనే గొల్లుమన్నారు రమాకాంత్ దంపతులు.

"పాపకేం ప్రమాదం లేదు. అనవసరంగా ఆ పిల్లను భయపెట్టకండి" అన్నాడు డాక్టర్ వాళ్ళని మందలిస్తూ.

"థాంక్స్ డాక్టర్‌గారూ" అంటూ రెండు చేతులూ పట్టుకున్నాడు రమాకాంత్.

"ఇందులో నేను చేసిందేం లేదు. మీకు కృతజ్ఞతలు చెప్పాలని వుంటే మీ పాపను హాస్పిటల్‌కు తీసుకొచ్చిన వ్యక్తికి చెప్పండి. పాపం చాలా రిస్కు తీసుకున్నాడు. మీ పాపది రేర్ బ్లడ్ గ్రూప్. సమయానికి హాస్పిటల్‌లో లేదు. విషయం విని తన భార్యది కూడా అదే గ్రూపని చెప్పి ఆమెను తీసుకొచ్చి రక్తం ఇప్పించాడు. పాపం రాత్రంతా ఇక్కడే వున్నాడు. ఒక విధంగా చెప్పాలంటే మీ పాపకు ప్రాణభిక్ష పెట్టింది అతనే" అన్నాడు డాక్టర్. ఈ రోజుల్లో ఇంత మానవత్వాన్ని ప్రదర్శించిన మనిషి ఎవరా అని నేను ఆశ్చర్యపోయేంతలో

"అదుగో అతనే మీ పాపను తీసుకొచ్చింది" అంటూ అప్పుడే లోపలికి వస్తున్న రమేష్‌ని చూపించేడు డాక్టర్.

అంతే. రమాకాంత్ దంపతులు బొమ్మల్లా బిగుసుకుపోయారు.

"నమస్తే సార్. పాప మీ బిడ్డని తెలవదు సార్. నిన్న ఇంటికెళుతుంటే రోడ్డు మీద రక్తం మడుగులో పడి వుంది పాప. ఏదో కారు గుద్దేసి వెళ్ళిపోయిందట. వెంటనే హాస్పిటల్‌కి తీసుకొచ్చాను. కానీ ఎవరి పాపంటే ఏం చెప్పాలో తెలీక జరిగిన విషయం చెప్పాను. పాప స్కూల్ బ్యాగ్ ద్వారా ఎడ్రస్ సంపాదించవచ్చని మళ్ళీ యాక్సిడెంట్ అయిన దగ్గరకు పరుగెత్తాను కానీ అప్పటికే ఆ బ్యాగ్ ఎవరో తీసుకుపోయారు. అందుకని పాపకు స్పృహ వచ్చేంతవరకూ మీ ఎడ్రస్ తెలీలేదు" అన్నాడు రమేష్.

రమాకాంత్‌లో ఇంకా చలనం రాలేదు.

"బావా. పాపకు తెలివొచ్చిందా?" ఆత్రంగా అడుగుతూ లోపలికొచ్చిన గౌరమ్మ మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయింది,

"ఆ. పాపకిక భయంలేదు. ఆ పాప ఎవరో కాదే. మా సారు బిడ్డేనట" అన్నాడు రమేష్.

"గట్లనా. అయ్యో బిడ్డ కనపడక కన్నోల్లు ఎంత తన్నులాడుండ్రో అని రాత్రంతా పరేషాన్ అయినం సారూ. దేవుడు సల్లగ జూసిండు. ఇంగ బిడ్డకేం భయంలేదు. సందమామ లాంటి పిల్ల. ఎవ్వరి పాపిష్టి కళ్ళు బడ్డయో. గింత గోరం జరిగింది. బిడ్డకు మంచిగయితే మా ఊరికి పోయినప్పుడు పోశమ్మ తల్లికి కల్లు పోయిస్తనని మొక్కుకున్న. మీరు కూడ ఓ ఆదివారం పూట ఆ తల్లికి మనసులోనే దండం పెట్టుకొని కొబ్బరికాయ కొట్టుండ్రి" అంది గౌరమ్మ.

"మరి కలుస్తాన్ సార్. ఇంటికెళ్ళి స్నానం చేసి ఆఫీసుకొస్తాను" అన్నాడు రమేష్ కదలబోతూ.

రమాకాంత్‌లో చలనం వచ్చింది. జేబులోంచి పర్సు తీసి రమేష్ చేతిలో కొన్ని నోట్లు వుంచబోయాడు.

చప్పున చేతిని వెనక్కి లాక్కున్నాడు రమేష్. "ఏంటిసార్ ఇది? ఆ పాప వున్నవాళ్ళ బిడ్డ కదా. తరువాత డబ్బులు వసూలు చేయవచ్చని నేను ఈ పని చేయలేదు సార్. ఆ స్థితిలో ఓ రిక్షా లాగేవాడి కూతురున్నా నేను ఇలాగే చేసేవాణ్ణి. ఆ డబ్బుని పాప పేరుమీద కుంటివాళ్ళకు, గుడ్డివాళ్ళకు దానం చేయండి సార్. వస్తాను సార్" అని భార్యను తీసుకుని అక్కడ నుంచి కదిలాడు రమేష్.

ఉన్నవాళ్ళ అరిస్టోక్రసీని భూమిలోకి పాతేస్తూ తమ ఔన్నత్యాన్ని ఆకాశమంత ఎత్తుకు పెంచుకున్న ఆ దంపతులను అలా చూస్తుండిపోయాను. ●